సంచలన సాయంకాల పత్రిక

సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 26-8-2024

సంపుటి: 20 సంచిక: 131

పేజీలు: 4 వెల: రూ.1

సిండికేట్ మాయాజాలంలో చికెన్!

- లోకల్ సరుకుకే బ్రాండెడ్ ముద్రతో మోసం
- పేపర్ రేటు పేరుతో అధిక ధరలకు అమ్మకాలు
- విజయనగరం, విశాఖ కంటే మన దగ్గర అధిక రేటు
- పౌల్ట్రీ రంగంలో సింహభాగం ఆ మూడు సంస్థల పెత్తనమే

పేపరు రేటు చూసి చికెన్ కొంటున్నారా?.. అయితే మీరు మోసపోతున్నట్లే. పేపర్‌లో ఆయా సంస్థల ప్రకటిస్తున్న రేట్లే నిజమనుకుంటే పప్పులో కాలేసినట్టే. ఎందుకంటే.. ఏ రోజు ఏ ధరకు చికెన్ అమ్మాలో నిర్ణయించేది సిండికేటే. అలాగని అన్ని జిల్లాల్లో రేట్లు ఒకేలా ఉంటున్నాయా అంటే అదీ లేదు. విజయనగరం ఫారం గేట్ ధరకు.. శ్రీకాకుళం ఫారం గేట్ ధరకు మధ్య కేజీకి రూ.15 తేడా ఉంటుంది. కానీ విశాఖ ఫారంగేట్ ధరకు విజయనగరం ఫారం గేట్ ధరకు మధ్య ఎటువంటి తేడా ఉండదు. ఆ రెండు జిల్లా ధర కంటే శ్రీకాకుళం జిల్లాలో చికెన్ ధర దాదాపు రూ.15 ఎక్కువగా ఉంటోంది. పోనీ విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి రవాణా చేసి తెప్పిస్తున్నారేమో.. అందువల్లే రవాణా ఛార్జీలతో కలిపి ధర ఎక్కువ వసూలు చేస్తున్నారనుకుందామంటే అలా కూడా జరగడంలేదు. ఈ జిల్లాలోని ఫౌల్ట్రీల నుంచే తెచ్చి అమ్ముతున్నారు. మరోవైపు పేపర్‌లో ప్రకటించే ధర కంటే తక్కువకే విజయనగరం జిల్లాలో విక్రయాలు చేస్తుంటే.. శ్రీకాకుళంలో మాత్రం పేపర్ ధరకే విక్రయిస్తున్నారు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మార్కెట్లో అమలవుతున్న చికెన్ ధరలన్నీ సిండికేట్ సృష్టించిన మాయాజాలమే. పౌల్ట్రీ అసోసియేషన్ ఏరోజుకారోజు చికెన్ అమ్మకం ధరలను నిర్ణయించి ప్రతిరోజూ సాయంత్రం పత్రికలకు ప్రకటన జారీ చేస్తుంటుంది. మరుసటి రోజు పత్రికల్లో కనిపించే ఆ ధరకే చికెన్ అమ్మకాలు జరుపుతుంటారు. కానీ అసోసియేషన్ ఇచ్చిన పేపర్ పేపర్ ధరకే విక్రయాలు జరుపుతున్నామన్న సాకుతో కేజీ వద్ద రూ.60కి పైగా వినియోగదారులను దోపిడీకి గురిచేస్తున్నారు. విజయనగరంతో పోల్చుకుంటే శ్రీకాకుళంలో కేజీపై రూ.15 అధిక ధర పేపర్‌లో చూపించి సిండికేట్ మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా రోజులకంటే ఆదివారం చికెన్ ఎక్కువగా అమ్ముడవుతుంది. జిల్లాలో సగటున 15 లక్షల కేజీలు విక్రయిస్తారు. ఆ లెక్కన ఒక్క ఆదివారం నాడే కనీసం రూ.2 కోట్ల వరకు ఆర్జిస్తున్నారు. ధరలపై అవగాహన ఉన్నవారు ప్రశ్నిస్తే పేపర్ ప్రింట్ తప్పు పడిందని, లేదంటే పాత రేటే ముద్రించారని బుకాయిస్తారు. ఈ సిండికేట్ మాయాజాలం జిల్లాలో పదేళ్ల నుంచి కొనసాగుతోంది. కొంతమంది - మిగతా 4లో

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	109	95
లైవ్	131	115
డ్రెస్‌డ్	190	200
స్కిన్‌లెస్	216	210

విశాఖపట్నంలో చికెన్ ధర

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	115	200	210

విజయనగరంలో చికెన్ ధర

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

శ్రీకాకుళంలో చికెన్ ధర

- మంత్రి అచ్చెన్నను కలిసిన దళిత సంఘాల జేఏసీ
- నిమ్మ హయాం నుంచి భ్రష్టు పట్టిపోయిందని ఫిర్యాదు
- ప్రస్తుత రిజిస్ట్రార్ కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

వర్సిటీ అక్రమాలపై సర్కారు స్టాండ్ ఏమిటి?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అక్రమాలకు ఆలవాలంగా మారిన స్థానిక యూనివర్సిటీ విషయంలో ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియజేయాలని దళిత సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వర్సిటీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేసింది. మాజీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు హయంలో ఆయన శిష్యుడైన ఎడ్యుకేషన్ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హనుమంతు సుబ్రహ్మణ్యం పెత్తనం సాగించి వర్సిటీని పూర్తిగా భ్రష్టు పట్టించినా ఇప్పటివరకు చర్యలు లేవని ఆరోపించారు. ఈ మేరకు దళిత సంఘాల జేఏసీ ప్రతినిధులు సోమవారం నిమ్మాడలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీకాకుళంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వర్సిటీలో జరిగిన, జరుగుతున్న అక్రమాలను వివరించారు. నిమ్మ వెంకట్రావు హయాంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు విరుద్ధంగా అడ్డగోలు నియామకాలు జరిపి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. కంప్యూటర్ల కొనుగోళ్లలోనూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, దానిపై పలుమార్లు విచారణ జరిగినా బాధ్యులపై ఇంత వరకు చర్యలు లేవని విమర్శించారు. ఈ అక్రమాలపై దళిత సంఘాలు కొన్నాళ్లుగా ఆందోళనలు చేస్తున్నా ప్రస్తుత వీసీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నిమ్మ వెంకట్రావు హయాంలో ఎటువంటి నోటిఫికేషన్లు లేకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా జరిపిన అడ్డగోలు నియామకాలను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. ప్రస్తుత వీసీకి తెలియకుండా తన సొంతవారిని రిజిస్ట్రార్ నియమించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో స్థానిక వర్సిటీలో డీపీవోగా పని చేసి అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇక్కడి నుంచి వెళ్లిపోయి ఏలూరు డేటా మేనేజ్‌మెంట్ సర్వీసులో ఎనిమిది నెలలు పనిచేసిన వ్యక్తి మళ్లీ ఇక్కడికి ఉద్యోగిగా రావడానికి ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులను రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ నిబంధనల ప్రకారం నియమించారని నిలదీశారు. ఇది అధికార - మిగతా 4లో

ఆమె మెదడులో కణితి.. ఆగని పోరాట స్ఫూర్తి!

- కేబీసీ వేదికగా అందరినీ కదిలించిన నరేషి మీనా
- వైద్యం ఖర్చులు.. ఆపై ఐఏఎస్ లక్ష్యసాధనకు ప్రయత్నం
- రూ.50 లక్షలే గెలుచుకున్నా.. పోరాటంలో విజయం
- వైద్యఖర్చులు పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చిన అమితాబ్

ఐఏఎస్ కావాలన్నది ఆమె కల. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తన కల సాకారం చేసుకునేందుకు సొంత తెలివినే నమ్ముకుంది. ఉన్నత చదువులు చదివి ఒక చిన్నపాటి ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అవుతోంది. కానీ అనుకోని అవాంతరం ఆమె లక్ష్యానికి అడ్డుగా నిలిచింది. మెదడులో పెద్ద కణితి(గడ్డ) ఏర్పడింది. ఆ అడ్డంకిని అధిగమించేందుకు సర్జరీ చేయించుకున్నా సరిపోలేదు. మరింత ఉన్నత వైద్యం అవసరం. దానికి చాలానే ఖర్చు అవుతుంది. దాంతో వైద్యానికి అవసరమైన డబ్బును తానే సంపాదించాలనుకుంది. అప్పటికే కణితితో భారంగా మారిన మెదడుకే పని చెప్పింది. సాధారణంగా తలనొప్పి వస్తేనే తట్టుకోలేం. అలాంటిది మెదడులో కణితితో నిరంతరం బాధపడుతున్నా.. లెక్క చేయకుండా లక్ష్యసాధన కోసం బుర్రకు పదును పెట్టాల్సిన క్విజ్ షోను ఆశ్రయించింది. కౌన్ బనేగా కరోడ్‌పతి కార్యక్రమంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఆ ప్రయత్నంలో పూర్తిగా సఫలం కాలేకపోయినా.. ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్ మనసును కదిలించ గలిగింది. ఆమె వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చును భరించేందుకు అమితాబ్ ముందుకొచ్చేలా చేయడంలో విజయం సాధించింది. ఆ యువతి పేరే నరేషి మీనా. రాజస్థాన్‌కు చెందిన ఈమె ఎదుర్కొంటున్న కష్టం. దాన్ని అధిగమించి, తన కలలు సాకారం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నం యావత్తు యువతకు స్ఫూర్తి మంత్రంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి.. అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం యువతకు ఇచ్చిన సందేశం. కానీ చాలామంది జీవితంలో ఎన్నో సాధించాలని కలలుగంటారు.. కానీ వాటిని సాధించే ప్రయత్నంలో చిన్నపాటి అవరోధాలు ఏర్పడితే చాలు చతికిలపడిపోతారు. ఏ ప్రయత్నమూ ఫలించడం లేదని ఒత్తిడికి లోనైపోతారు. నిరాశ నిస్పృహలతో కుంగిపోతారు. ఇటువంటి వారందరికి తాను భిన్నమైన దాన్ని నరేషి మీనా నిరూపించారు. అబ్దుల్ కలాం నినాదాన్నే అందిపుచ్చుకుని తన జీవిత లక్ష్యాన్ని సాధించే దిశగా దూసుకుపోతోంది. ఈ పోరాటంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి, తీవ్ర అనారోగ్య సమస్యలు అడ్డొచ్చినా వాటిని కూడా సొంతంగానే అధిగమించేందుకు ఆమె చేసిన ప్రయత్నం కౌన్ బనేగా కరోడ్‌పతి(కేబీసీ) కార్యక్రమం ద్వారా వెలుగులోకి వచ్చి అందరినీ కదిలిస్తోంది. భారతీయ టెలివిజన్ చరిత్రలో అత్యధిక జనాదరణ పొందిన కార్యక్రమాల్లో అగ్రస్థానంలో నిలిచే కేబీసీ 16వ సీజన్ కార్యక్రమం ఈ నెల 12 నుంచి ప్రారంభమై కొనసాగుతోంది. సోనీ టీవీలో ప్రసారమయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి మెదడుకు మేతతోపాటు భారీ ప్రైజ్ మనీ అందుకుని ఆర్థిక లక్ష్యాలను సాధించుకునే అవకాశం లభిస్తుంది. నరేషి మీనా కూడా తన ఆరోగ్య సమస్య, జీవిత లక్ష్యం సాధించుకునేందుకు కేబీసీనే వేదికగా ఎంచుకుంది. కార్యక్రమ వ్యాఖ్యాత అమితాబ్ ముందు హాట్ సీట్‌లో కూర్చోవడమే కాకుండా 16వ సీజన్‌లో కోటి రూపాయల ప్రశ్నను ఎదుర్కొన్న తొలి కంటెస్టెంట్‌గా నిలిచింది. కానీ రూ.కోటి ప్రశ్నకు సమాధానం చెప్పే విషయంలో తడబడి రూ.50 లక్షలతోనే నిష్క్రమించింది. అయితేనేం.. తాను అనుకున్నది సాధించగలిగింది. రూ.50 లక్షలతోపాటు తన చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును భరించేలా అమితాబ్ నుంచి వరం అందుకుంది.

ఎవరీ నరేషి మీనా?

సాధారణ కుటుంబానికి చెందిన నరేషి మీనా స్వగ్రామం. రాజస్థాన్ రాష్ట్రంలోని సవాయ్ మాధోపూర్. తండ్రి సాధారణ రైతు, తల్లి గృహిణి. బాగా చదువుకొని కలెక్టర్ కావాలన్నది మీనా కల. అందుకోసం కష్టపడి చదివేది. స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే తొమ్మిదో తరగతి వరకు చదివిన తర్వాత సవాయ్ మాధోపూర్‌లో 12వ తరగతి, అక్కడే 2017లో బీఏ పూర్తి చేసింది. అనంతర పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. తర్వాత ముందు ఒక ఉద్యోగం సంపాదించుకుని ఆర్థిక పరిస్థితులు చక్కదిద్దుకుంటూనే ఐఏఎస్(సివిల్స్) కావాలన్న లక్ష్యసాధనకు ప్రిపేర్ అయ్యేది. ప్రస్తుతం ఆమె రాజస్థాన్‌లోని మహిళా సాధికారత విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తోంది. ఓసారి తీవ్రమైన తలనొప్పి వచ్చింది. మందులు వాడినా తగ్గలేదు. అదే సమయంలో 2018లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసింది. తీవ్రమైన తలనొప్పిని భరిస్తూనే పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించింది. అనంతరం రిక్రూట్‌మెంట్‌లో భాగంగా నిర్వహించే వైద్య పరీక్షలకు వెళ్లినప్పుడు తన తలనొప్పికి కారణమేంటో తెలిసింది. మెదడులో కణితి ఉందని వైద్యపరీక్షల్లో తేలింది. సర్జరీ చేసి దాన్ని తొలగించాలని డాక్టర్లు చెప్పారు. కానీ ఇంటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. కానీ కుమార్తె ఆరోగ్యం కోసం తల్లిదండ్రులు ఆలోచించారు. ఇంట్లో ఉన్న నగలు అమ్మి 2019లో సర్జరీ చేయించారు.

సమస్యను పరిష్కరించని సర్జరీ

అయితే సర్జరీతో ఆమె ఆరోగ్య సమస్య పరిష్కారం కాలేదు. పైగా మరింత చిక్కుల్లో పడేసింది. మెదడులోని సున్నిత భాగంలో కణితి ఉండటం వల్ల సర్జరీ ద్వారా దాన్ని డాక్టర్లు పూర్తిగా తొలగించలేకపోయారు. ఇంకా పావు వంత కణితి ఉండిపోయింది. మెదడుకు దెబ్బతగలకుండా దాన్ని పూర్తిగా తొలగించాలంటే ప్రోటాన్ థెరపీ చేయించాలని, దానికి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దాంతో మీనాతోపాటు ఆమె కుటుంబీకులు హతాశులయ్యారు. అంత డబ్బు సమకూర్చే పరిస్థితి లేదు. దాంతో మీనా కొన్నాళ్లు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు అన్నలు ఆమెకు ధైర్యం చెబుతూ అండగా నిలిచారు. ఓవైపు తలనొప్పి.. మరోవైపు రూ.30 లక్షల అవసరం.. ఇంకోవైపు సివిల్స్ సాధించాలన్న లక్ష్యం. ఈ పరిస్థితుల్లో కుటుంబానికి మరింత భారం కాకూడదన్న ఉద్దేశంతో డిప్రెషన్‌ను తట్టుకుని మీనా సూపర్‌వైజర్ ఉద్యోగంలో చేరింది.

ఆశలు రేపిన కేబీసీ

ఉద్యోగం చేస్తూనే తన చికిత్సకు డబ్బు గురించి ఆలోచిస్తూ.. మరోవైపు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న మీనాకు కౌన్ బనేగా కరోడ్‌పతి కార్యక్రమం ఆశలు రేపింది. తన కోచింగ్ సెంటర్ టీచర్ ప్రేరణతో కేబీసీలో పాల్గొనాలన్న ఆలోచన కలిగింది. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న తాను కేబీసీలో అడిగే ప్రశ్నల్లో చాలావాటికి సమాధానం చెప్పగలనన్న నమ్మకం కలిగింది. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసి కంటెస్టెంట్‌గా ఎంపికైంది. తన ప్రతిభతో హాట్‌సీట్‌లోనూ కూర్చోగలిగింది. హాట్ సీట్‌కు చేరుకున్న వారికి ప్రశ్నలు సంధించే ముందు వారి పూర్తి వివరాలను కార్యక్రమ ప్రయోక్త అమితాబ్ తెలుసుకుంటుంటారు. ఆ క్రమంలోనే నరేషి మీనా ఆరోగ్య సమస్య, స్ఫూర్తిదాయక ప్రయత్నాల గురించి ఆమె ద్వారానే తెలుసుకుని అమితాబ్ చలించిపోయారు. తన చికిత్సకు అవసరమైన డబ్బు సమకూర్చుకునేందుకే తాను కేబీసీకి వచ్చినట్లు మీనా చెప్పడంతో కదిలిపోయారు. షోలో ఆమె గెలిచినా గెలవలేకపోయినా చికిత్సకు అవసరమైన ఖర్చులను తానే భరిస్తానని సూపర్‌స్టార్ ముందే హామీ ఇచ్చారు. అనుకున్నట్లే మీనా ఒకటి తర్వాత ఒకటిగా ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ రూ.50 లక్షల టార్గెట్ ఛేదించింది. ఆ తర్వాత అమితాబ్ రూ.కోటి ప్రశ్నను సంధించారు. వింబుల్డన్ టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో లీలారావు దయాళ్ ఎవరిని ఓడించి ఛాంపియన్‌షిప్ సాధించారన్న ఆ ప్రశ్నకు మీనా సమాధానం చెప్పలేక రూ.50 లక్షలతోనే షో నుంచి క్విట్ అయిపోవాల్సి వచ్చింది. అయితే తాను ముందే ఇచ్చిన హామీ ప్రకారం వైద్యానికి అయ్యే ఖర్చును భరిస్తానని, కేబీసీ ద్వారా వచ్చిన రూ.50 లక్షలను ఐఏఎస్ కల సాధించుకోవడానికి, ఇతరత్రా అవసరాలకు వాడుకోవాలని అమితాబ్ మీనాకు సూచించి తన పెద్దమనసును చాటుకున్నారు.

• ఎడిటోరియల్

సాగినంత కాలమే సహజీవన సుఖం!

మనదేశంలో వివాహ వ్యవస్థకు ఉన్నంత భద్రత, గౌరవం మరే వ్యవస్థకూ లేదనడం అతిశయోక్తి కాదు. వివాహంతో ఒక్కటైన జంటలకు సమాజంతో పాటు గ్రామ, కుటుంబ పెద్దలు రక్షణగా నిలుస్తుంటారు. అలాగే కోర్టులు, ప్రభుత్వాలు కూడా చట్టపరమైన రక్షణ కల్పిస్తుంటాయి. పెళ్లయిన ఒక జంట విడిపోవాలనుకున్నప్పుడు దానికి వారు చెప్పే కారణాలను పరిశీలించి సమంజసమేనని అనిపిస్తేనే న్యాయస్థానాలు విడాకులు మంజూరు చేస్తాయి. అదే సమయంలో భర్త నుంచి విడిపోతున్న మహిళకు, వారి పిల్లలకు సంరక్షణ, ఆస్తుల విషయంలోనూ న్యాయబద్ధమైన పరిష్కారం చూపిస్తుంటాయి. ఇన్ని రకాల రక్షణ కవచాలు ఉన్నప్పటికీ వివాహ వ్యవస్థను కాదని చాలామంది సహజీవనం వైపు మొగ్గు చూపుతున్నారు. దీన్నే లివ్ ఇన్ రిలేషన్‌షిప్ అంటున్నారు. అయితే వివాహం ద్వారా దంపతులైన జంటలకు సంఘంలోనూ, చట్టపరంగానూ లభించే రక్షణ సహజీవన వ్యవస్థలో ఉండేవారికి, వారి సంతానానికి లభిస్తాయా? సమాజంలో వారి పిల్లలకు లభించే స్టేటస్ ఎలా ఉంటుందన్న సందేహాలు కూడా ఉండటం సహజం. వివాహం చేసుకున్నవారికి మాదిరిగానే సహజీవన వ్యవస్థకు కొన్ని రకాల రక్షణ చట్టపరంగానే లభిస్తుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. పెళ్లి కాకుండా ఆడామగా కలిసి జీవించడాన్ని.. అంటే సహజీవనం చేయడాన్ని ఒకప్పుడు సంఘవ్యతిరేక చర్యగా పరిగణించేవారు. కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో ఇప్పుడు సహజీవనం కామన్ అయిపోతోంది. పెళ్లి చేసుకునే కంటే చేసుకోకుండానే కలిసి ఉండటానికే ఆధునిక యువతీయువకులు ఇష్టపడుతున్నారు. వాస్తవానికి ఇది పాశ్చాత్య సంస్కృతి. అక్కడి నుంచే మన దేశంలోకి దిగుమతి అయ్యి.. క్రమంగా మహానగరాలు, పట్టణాలకు.. ఇప్పుడు గ్రామాలకు సైతం విస్తరిస్తోంది. పెళ్లి కాకుండానే కాపురం ఏంటి? అని ఆక్షేపించే పరిస్థితి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పుతో తొలగిపోయింది. ఇతరుల స్వేచ్ఛను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని, సహజీవనం కూడా వ్యక్తిగత స్వేచ్ఛ కిందకే వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించడం విశేషం. పెద్దల సమక్షంలో సవాలక్ష ఒప్పందాలతో జరిగిన పెళ్లిళ్లే కొన్నాళ్లకు పెటాకులైపోతున్నాయి. దాంతో పెళ్లి పేరుతో చేసిన భారీ ఖర్చులు వృథా అవుతున్నాయన్న భావన పెరుగుతోంది. దాంతో వివాహం కంటే సహజీవనమే బెటర్ అన్న భావన యువజనంలో పెరుగుతోందంటున్నారు. చట్టప్రకారం 21 ఏళ్లు నిండిన పురుషుడు, 18 ఏళ్లు నిండిన యువతి తమ ఇష్టప్రకారం సహజీవనం చేయవచ్చు. అదే విధంగా భార్యను కోల్పోయిన భర్త, భర్తను కోల్పోయిన భార్య పరస్పర అంగీకారంతో సహజీవనం చేయవచ్చు. అయితే వివాహ బంధంలో ఉన్న పురుషులు గానీ, స్త్రీలు గానీ వేరొకరితో అవాంఛిత సంబంధం పెట్టుకుంటే అది సహజీవనం కిందకు రాదు. పౌరహక్కుల పరిరక్షణ చట్టం-1955 ప్రకారం దేశంలో ప్రతిఒక్కరికీ జీవించే హక్కు, స్వేచ్ఛ, భద్రత కల్పిస్తోంది. సహజీవనం చేసే వారికి కూడా ఇవే వర్తిస్తాయి. అయితే దీనికి కొన్ని ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ఇద్దరూ కలిసి ఉంటున్నట్లు వారు అద్దెకుంటున్న ఇంటి ఓనరు లేదా ఇరుగుపొరుగువారు లేదా తాము పరస్పర అంగీకారంతో కలిసి ఉంటున్నట్లు స్వయంగా ఆ జంట అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం జారీ చేసే రేషన్ కార్డు, ఆధార్ కార్డుల్లోనైనా వారిద్దరి పేర్లు ఉన్నా సరిపోతుంది. అప్పుడే సహజీవన జంట మధ్య ఏదైనా గొడవ జరిగితే చట్టపరమైన రక్షణ పొందేందుకు, పరిష్కారం కోరేందుకు అవకాశం ఉంటుంది. సహజీవన జంటలకు గృహహింస చట్టం కింద కూడా రక్షణ లభిస్తుంది. వేధింపుల నుంచి రక్షణ, ఇతరత్రా న్యాయ సహాయం పొందేందుకు సహజీవనంలో ఉన్న మహిళలకు వెసులుబాటు ఉంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-1973లోని సెక్షన్ 125(1)(ఏ) ప్రకారం వివాహం ద్వారా దంపతులైనవారికి ఎంత రక్షణ లభిస్తుందో లివ్ ఇన్ రిలేషన్‌షిప్పులో ఉన్నవారికి కూడా అంతే రక్షణ లభిస్తుంది. వారి జీవనం గడవడానికి కూడా ఖర్చులు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇటీవలి కాలంలో శాసన, న్యాయ వ్యవస్థలు సహజీవన వ్యవస్థకు హక్కులు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఆమోదించిన యూనిఫారం సివిల్ కోడ్ ప్రకారం రిలేషన్‌షిప్‌లో ఉన్న జంటలు తమ బంధాన్ని ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవచ్చు. దీనివల్ల వీరికి చట్టపరమైన హక్కులు, ఆస్తుల్లో వాటాలపై హక్కులు లభిస్తాయి. అలాగే ఈ జంటలకు పుట్టే పిల్లలకు కూడా హక్కులు వర్తిస్తాయి. పెళ్లి చేసుకోకుండా కలిసి ఉంటున్న జంటలకు కలిగే సంతానం వివక్షకు గురికాకూడదని ఇటీవలి కాలంలో కోర్టులు కూడా తీర్పులు ఇస్తున్నాయి. హిందూ మైనారిటీ, గార్డియన్‌షిప్ చట్టం ప్రకారం కూడా ఈ పిల్లల హక్కులకు రక్షణ లభిస్తుంది. ఒకవేళ పిల్లల విషయంలో ఏవైనా వివాదాలు తలెత్తితే వారు తమ జంటకే పుట్టినట్లు వారు నిరూపించుకోవాల్సి ఉంటుంది. మన సమాజం ఇంకా పూర్తిస్థాయిలో సహజీవనాన్ని ఆమోదించే పరిస్థితి లేకపోయినా సామాజిక కట్టుబాట్లు ఇబ్బంది పెట్టకుండా, మిగతా వారిలా గౌరవంగా జీవించగలిగే పరిస్థితిని న్యాయస్థానాలు, చట్టాలు పౌరులకు కల్పిస్తున్నాయి. అయితే వైవాహిక జంటలతో పోలిస్తే సహజీవన జంటల విషయంలో కొన్ని ఇబ్బందికరమైన అంశాలు కూడా ఉన్నాయి. పెళ్లి కాకుండా సహజీవనం చేసే జంటల్లో స్వేచ్ఛ కాస్త ఎక్కువగా ఉంటుంది. ఇది వారు తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పిస్తున్నా.. అభిప్రాయ భేదాలు తలెత్తినప్పుడు పుటుక్కున తమ బంధం తెంచేసుకునే ప్రమాదం కూడా ఉంది. వివాహమైన దంపతులు విడిపోవడం చాలా కష్టం. దానికి చాలా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కానీ రిలేషన్‌షిప్‌లో ఉన్న జంటలు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఒక్క మాటతో విడిపోవచ్చు. అందువల్ల సహజీవనానికి స్థిరత్వం లేనట్లే.

ఉత్తరాంధ్రకే తలమానికం జెమ్స్

(సత్యంన్యూస్, టెక్కలి)

ప్రజలకు మెరుగైన వైద్య సేవలతోపాటు ఆరోగ్య సమాజం కోసం ఎంతోమంది వైద్యులను అందిస్తున్న జెమ్స్ ఆసుపత్రి ఇటు ఉత్తరాంధ్ర, అటు ఒడిశాకు తలమానికంగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశంసించారు. ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కిమ్స్, జెమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అత్యాధునిక మౌలిక వసతులతో నిర్మించిన జెమ్స్ హాస్పిటల్, జేమ్స్ మెడికల్ కాలేజీ, బొల్లినేని స్కిల్ సెంటర్‌లు, కొత్తగా విస్తరిస్తున్న కిమ్స్ ఆస్పత్రితో పాటు టెక్కలి జిల్లా ఆసుపత్రి, రిమ్స్ వైద్య కళాశాల, రిమ్స్ జనరల్ ఆస్పత్రి, మిగిలిన కార్పొరేట్ ఆసుపత్రులను అనుసంధానిస్తూ ఒక మెడికల్ హబ్‌గా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రం చుట్టూ త్వరలోనే రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని, జెమ్స్ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రి మెడికల్ యూనివర్సిటీ స్థాయికి చేరుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. మంత్రిని కలిసిన వారిలో జెమ్స్ సీఈవో బొల్లినేని అద్విత్, డైరెక్టర్లు డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, స్వర్ణ రామ్మోహనరావు తదితరులు ఉన్నారు.

సంజీవిని జెమ్స్ : రాము

జెమ్స్ ఆసుపత్రి జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా అటు ఒడిశా, ఇటు ఉత్తరాంధ్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి సంజీవనిగా సేవాలందిస్తోందని పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కితాబిచ్చారు. నగరంలోని రామ్మోహన్ నాయుడు నివాసంలో కిమ్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జెమ్స్ బోధనాసుపత్రి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం పట్ల కిమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావును కేంద్ర మంత్రి అభినందించారు.



యువత మరిన్ని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు మరిన్ని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. రణస్థలం మండలానికి చెందిన రమణ నిర్వహిస్తున్న 'అరే మావ' యూట్యూబ్ ఛానల్ 25లక్షల మంది ఫాలోవర్లు సాధించిన సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దాదాపు 200 మంది రక్తదానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఎచ్చెర్ల ఎమ్మెల్యేతో భేటీ..

రణస్థలం పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి కార్యకర్తలతో మాట్లాడారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని సూచించారు. అంతకుముందు ఆయన ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఇంటికి వెళ్లి కలుసుకున్నారు. నియోజకవర్గానికి సంబంధించిన ప్రజా సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు.



31 వరకు క్రీడా వారోత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 29న మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లాలో ఈ నెల 31 వరకు క్రీడా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సెట్‌శ్రీ సీఈవో బివి ప్రసాదరావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కోడి రామ్మూర్తి స్టేడియంలో క్రీడాకారులు, జిల్లాలోని వివిధ హాస్టల్స్ విద్యార్థినీ విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. 27న క్రీడా మైదానాల్లో పోటీలు, 28న వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు, 29న ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగుల, వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి ర్యాలీ, 30, 31 తేదీల్లో అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడాంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 'ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోడానికి ఫిట్‌నెస్, నా ఆరోగ్యం కోసం ప్రతి రోజూ 30 నిమిషాలు కేటాయిస్తాను.. నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేలా ప్రోత్సహిస్తాను' అని క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో క్రీడా ప్రాధికారిక సంస్థ డీఎస్‌డీవో శ్రీధర్, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, మేనేజర్ అప్పలనాయుడు, పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణ రావు, డీఎస్సీలో పని చేస్తున్న కోచ్‌లు హాజరయ్యారు.



బీజేపీ సీనియర్ నాయకులు పైడి వేణుగోపాలం, పైడి రాజారావు, అంధవరపు ప్రసాద్, సంతోష్, సంపతిరావు నాగేశ్వరరావు, కూటమి నాయకులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను బీజేపీ వెస్ట్ మండల కార్యాలయంలో కలిసి పీఎన్ కాలనీ సమస్యలు, అభివృద్ధి కార్యాచరణపై చర్చించారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

2015లో వచ్చిన హారర్ థ్రిల్లర్ 'డిమాంటి కాలనీ' తమిళంలో మంచి విజయం సాధించింది. ఇప్పుడా చిత్రానికి సీక్వెల్ రూపొందించాడు దర్శకుడు అజయ్ ఆర్.జ్ఞానముత్తు. తెలుగు ప్రేక్షకుల దృష్టినీ ఆకర్షించిన ఈ చిత్రం ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

క్రేజీ..గజిబిజి!

సాంకేతిక వర్గం:

టెక్నకల్ గా డిమాంటి కాలనీ-2 ఉన్నత ప్రమాణాలతోనే సాగింది. సామ్ సీఎస్ బ్యాగ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. థ్రిల్లర్ సినిమాలకు పేరుపడ్డ అతను.. రేసీ బీజీఎంతో ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచాడు. హరీష్ కన్నన్ ఛాయాగ్రహణం కూడా బాగుంది. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. సినిమా రిచ్ గానే కనిపిస్తుంది. కానీ విజువల్ ఎఫెక్ట్స్ మాత్రం అంత గొప్పగా లేవు. అజయ్ జ్ఞానముత్తు తానొక భిన్నమైన రచయిత-దర్శకుడు అని మరోసారి చాటాడు. అతను రాసుకున్న కథ కొత్తగా.. క్రేజీగా అనిపిస్తుంది. డిమాంటి కాలనీకి.. పార్ట్-2కు సరిగ్గా లింక్ చేసి ప్రాపర్ సీక్వెల్ గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. కానీ కాన్సెప్ట్ చాలా బాగున్నా.. అతడి స్క్రీన్ ప్లే మాత్రం చాలా గందరగోళంగా అనిపిస్తుంది. నరేషన్లో క్లారిటీ ఉండుంటే డిమాంటి కాలనీ-2 రీచ్ పెరిగేది. ఒక స్పెషల్ ఫిలింగా నిలిచేది.

హీరోయిన్ ఆత్మల ప్రపంచం లోకి వెళ్లి.. తన బాయ్ ఫ్రెండ్ ఆత్మతో మాట్లాడే సన్నివేశం అయితే వారెవా అనిపిస్తుంది. డిమాంటి కాలనీ-1లో చనిపోయిన హీరో పాత్రకు.. పార్ట్-2లో కథకు ముడిపెట్టిన విధానం కూడా చాలా కొత్తగా అనిపిస్తుంది. ఉత్కంఠ రేకెత్తించే మలుపులు.. రసవత్తరమైన సీన్లతో ఒక దశ వరకు డిమాంటి కాలనీ క్రేజీ రైడ్ లాగా అనిపిస్తుంది.

కథ:

తన బాయ్ ఫ్రెండ్ సామ్ అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో తన మరణం వెనుక రహస్యమేంటో తెలుసుకోవాలని అనుకుంటుంది డెబ్బీ (ప్రియ భవానీ శంకర్). అందుకోసం దావోషి అనే బౌద్ధ స్వామీజీ సాయంతో సామ్ ఆత్మతో మాట్లాడే ప్రయత్నం చేస్తుంది. తన ఆత్మకు.. శ్రీనివాస్-రఘునందన్ అనే కవల సోదరులకు సంబంధం ఉందని తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఒక మిస్టీరియస్ బుక్ చదివిన వాళ్లు ఆరేళ్లకోసారి చనిపోయి వారి ఆత్మలన్నీ ఒక చోట ఇరుక్కుపోతున్న విషయం కూడా వెల్లడవుతుంది. మళ్లీ ఆరేళ్లకు ఆ సైకిల్ పునరావృతం అయి.. పెద్ద ప్రమాదం చోటు చేసుకోబోతోందని ప్రియకు తెలియడంతో ఈ ప్రమాదాన్ని తప్పించడానికి ఆమె ఏం చేసింది.. ఈ క్రమంలో ఆమెకు ఎదురైన అనుభవాలేంటి అన్నది మిగతా కథ.

కథనం-విశ్లేషణ:

ఓ దర్శకుడు ఎంత గొప్ప కథైనా రాసుకోనీ.. అందులో ఎన్ని ట్విస్టులైనా ఉండనీ.. ఎంత కొత్తదనమైనా జోడించనీ.. ప్రేక్షకులకు అది అర్థమైతేనే ఆ సినిమాను ఆస్వాదించే అవకాశముంది. కొంచెం నర్మగర్భంగా కథను.. సన్నివేశాలను నరేట్ చేయడం వరకు ఓకే. కానీ తెర మీద అసలేం జరుగుతోందో అర్థం కాని అయోమయం నెలకొంటే.. ప్రతి సన్నివేశం గందరగోళంతో ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.. సమాధానాలు దొరకని ప్రశ్నలు పేరుకు పోతుంటే.. చికాకు పుడుతుందే తప్ప మంచి అనుభూతి కలగదు. డిమాంటి కాలనీ-2 సినిమా ప్రేక్షకులకు ఇలాంటి అనుభవాన్నే మిగులుస్తుంది. దర్శకుడు ఎంతో కసరత్తు చేసి చాలా వైవిధ్యంగా అనిపించే కథేదో రాశాడు. కానీ ఏమాత్రం అర్థం కాని కథన శైలి ప్రేక్షకులకు మిశ్రమానుభూతినే మిగులుస్తుంది. ఏదో కొత్తగా చూస్తున్నాం అనిపిస్తూనే.. అసలు మనం చూస్తున్నదేంటో అర్థం కాని కన్ఫ్యూజన్ డిమాంటి కాలనీ-2ను యావరేజ్ మూవీగా మార్చింది. ఐతే ప్రథమార్థంలోనే కథ.. పాత్రల పరంగా కన్ఫ్యూజన్ ప్రేక్షకులను వెంటాడుతుంది. ఈ కన్ఫ్యూజన్ అంతా తర్వాత పోతుందని.. ద్వితీయార్థంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయని అనుకుంటాం. కానీ దర్శకుడు సెకండాఫ్ లో ఈ కన్ఫ్యూజన్ ను పతాక స్థాయికి తీసుకెళ్లాడు. అసలు తెరపై ఏం జరుగుతోందో అర్థం కానట్లుగా అంతులేని అయోమయంతో సాగే సన్నివేశాలు చికాకు పెట్టిస్తాయి. ద్వితీయార్థంలో హీరో హీరోయిన్లు.. బౌద్ధ గురు ఒక రెస్టారెంట్లో ఇరుక్కుపోయాక అక్కడ వారికి ఎదురయ్యే అనూహ్య పరిణామాల మధ్య గంటకు పైగా కథ నడుస్తుంది. ఐతే ఇక్కడ ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించే క్రమంలో విపరీతంగా విజువల్ ఎఫెక్ట్స్ మీద ఆధారపడ్డారు. అవి ప్రేక్షకులకు తలపోటు తెప్పిస్తాయి. ఏ పాత్ర ఏంటో.. ఏది ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో అర్థం కాక.. ఒక్క సన్నివేశంలోనూ లాజిక్ కనిపించక బుర్ర వేడెక్కిపోతుంది. సినిమా ముగిశాక కూడా చాలా ప్రశ్నలు సమాధానాలు లేకుండా అలాగే మిగిలిపోతాయి. పాత్రల మీద ఒక స్పష్టత రాదు. సినిమా అంతా అయ్యాక ఈ కథ ఏంటని అడిగితే సమాధానం చెప్పడం కష్టమవుతుంది. అంత గందరగోళంగా కథను నరేట్ చేశాడు దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు. ఐతే పార్ట్-3కి లీడ్ ఇస్తూ సాగే పతాక సన్నివేశాలు మాత్రం వావ్ అనిపించేలా ఉన్నాయి. ఎప్పుడూ చూసే హారర్ సినిమాలకు భిన్నంగా కథ త్తగా అనిపించడం.. సినిమా విజువల్ గా బాగుండడం.. కొన్ని మలుపులు సినిమాను వాచబుల్ గా మార్చాయి. కానీ కన్ఫ్యూజన్ నరేషన్ మాత్రం సినిమాకు పెద్ద మైనస్.

హారర్ సినిమాలంటేనే లాజిక్ తీసి అటక మీద పెట్టేయాలి. ఆత్మ అనే కాన్సెప్ట్ రాగానే కథ లాజిక్ కు దూరంగా నడుస్తుంది కాబట్టి రచయితలు-దర్శకుల ఊహలకు రెక్కలు వచ్చేస్తుంటాయి. తెర మీద ఊహకు అందని విధంగా ఎలాంటి ఫాంటసీని చూపించినా చెల్లిపోతుంది. కానీ ఆ చూపించేది కన్విన్సింగ్ గా.. అర్థమయ్యేలా ఉండడమే కీలకం. డిమాంటి కాలనీలో కథ-సన్నివేశాలు చాలా కొత్తగా క్రేజీగా అనిపిస్తూనే.. కన్విన్స్ చేస్తాయి కూడా. కథ పరంగా చూసుకుంటే డిమాంటి కాలనీ కంటే డిమాంటి కాలనీ-2లో ఇంకా కొత్తగా.. పెద్దగా అనిపిస్తుంది. బేసిక్ కాన్సెప్ట్ అయితే మైండ్ బ్లోయింగ్ అనే చెప్పాలి. ఈ కథను మొదలుపెట్టిన విధానం.. ఒక దశ వరకు ముందు తీసుకెళ్లిన తీరు.. ప్రధాన పాత్రలు.. పార్ట్-1తో ముడిపెడుతూ కథలో ఇచ్చిన ట్విస్టులు అన్నీ కూడా క్రేజీగా అనిపిస్తాయి.

నటీనటులు:

మూడీగా కనిపించే అరుల్ నిధి నుంచి గొప్ప నటననేమీ ఆశించలేం. డిమాంటి కాలనీ-1లో కూడా అతడి ప్రత్యేకతేమీ కనిపించదు. కథలో ఒక పాత్రలాగా కనిపిస్తాడు తప్ప హీరో అనిపించడు. పార్ట్-2లో అతను ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రకు సూటయ్యాడు కానీ.. పెర్ఫామెన్స్ పరంగా సాధారణంగా అనిపిస్తాడు అరుల్ నిధి. ఐతే కథలో అత్యంత కీలకమైన పాత్రలో నటించిన ప్రియ భవానీ శంకర్ మాత్రం అదరగొట్టింది. భయాన్ని, ఉత్కంఠను పలికించడంలో ఆమె ప్రత్యేకత కనిపిస్తుంది. తన అప్పీయరెన్స్ కూడా ఈ పాత్రకు బాగానే సూటయింది. సినిమాలో బెస్ట్ పెర్ఫామర్ ప్రియనే. ఇండియన్-2లో మామూలుగా అనిపించిన ప్రియ.. ఈ సినిమాలో తన నట కౌశలాన్ని చూపించింది. బౌద్ధ గురు పాత్రలో చేసిన నటుడు ఓకే. ముత్తుకుమార్ బాగా చేశాడు. మిగతా ఆర్టిస్టులంతా పాత్రల పరిధి మేరకు నటించారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

ఘనంగా మదర్ థెరిసా జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, రాజాం)

ఎందరో అనాధలు అభాగ్యులకు అమ్మగా వర్ధిల్లిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత భారతరత్న మదర్ థెరిసా 114వ జయంతి వేడుకలను రాజాం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రతీ ఒక్కరూ థెరిసాలా సేవా భావంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, రోటరీ క్లబ్ బీవీ అచ్యుత్ కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్యకుమార్, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ, మక్క అప్పలనాయుడు, రిటైర్డ్ బి. ఎంఈవో పంచముఖేశ్వరరావు, దామెర రాజా, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, కేవీ తిరుమల, పెంకి గౌరీశ్వరరావు, బొడ్డాపు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు ప్రతిరూపం థెరీసా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా భారతరత్న మదర్ థెరీసా నిలుస్తారని అరసవల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథం నాయుడు అన్నారు. థెరిసా 114వ జయంతి వేడుకలు గాంధీ మందిరంలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా విగ్రహ దాతలు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, హర్షవల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథం నాయుడు, లైన్స్ క్లబ్ చైర్మన్ హారికప్రసాద్, గాంధీమందిర కమిటీ ప్రతినిధులు థెరిసా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభాగ్యులకు సేవలందించి వారి జీవితాలను ఉద్ధరించేందుకు థెరిసా చూపిన బాట ప్రపంచానికి ఆదర్శమన్నారు. మానవ సేవలోనే జీవన పరమార్థం దాగివుందని చాటి చెప్పిన థెరిసా స్ఫూర్తిని కొనసాగించడమే తమ లక్ష్యమన్నారు. అవధాన పండితులు పైడి హరనాథరావు మాస్టర్ మదర్ థెరిసా గొప్పతనాన్ని గేయరూపంలో కీర్తించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు ప్రొఫెసర్ విష్ణుమూర్తి, నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణ్, పందిరి అప్పారావు, పొన్నాడ రవికుమార్, గుత్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని, పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇందిరానగర్ కాలనీ జిల్లా కార్యాలయంలో సిటు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. జిల్లాలో భారీ, మధ్య తరహా కెమికల్ పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో అగ్ని ప్రమాదం జరిగితే మన దగ్గర ఉన్న ఫైర్ ఇంజన్లతో అదుపు చేయడం సాధ్యం కాదని, హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్‌ఇంజన్ ఏర్పాటు చేస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించిందని గుర్తు చేశారు. జిల్లాలో పారిశ్రామిక ప్రమాదాల నివారణకు నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ వేయాలని ఈ కమిటీలో కార్మిక సంఘాల నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సమావేశంలో సిటు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణ మూర్తి, కె.సూరయ్య, జిల్లా కార్యదర్శులు అల్లు మహాలక్ష్మి, ఎన్‌వి రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, బి.ఉత్తర తదితరులు పాల్గొన్నారు.

సిలంబంకు పూర్వ వైభవం తీసుకొస్తాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

సిలంబం (కర్రసాము) పురాతన క్రీడ అని, ఆదరణ లేకపోవడంతో మరుగున పడుతుందని, దానిని పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కృషి చేస్తామని ఏపీ స్టేట్ సిలంబం టెక్నికల్ డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏపీ స్టేట్ సిలంబం అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని ఆదివారంపేట ప్రహ్లాద కళ్యాణ్ మండపంలో ఈ నెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ జీవన గమనంలో కర్రసాముకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ క్రీడ ఆరోగ్య, ఆత్మరక్షణ కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. కర్రసామును క్రీడాకారులు ఆదరించకపోవడంతో అది కనుమరుగయ్యే ప్రమాదంలో పడిందని చెప్పారు. చిన్నతనంలోనే కోచ్‌గా బాధ్యతలు చేపట్టి ఈ క్రీడను అభివృద్ధి చేస్తున్న హర్షవర్ధనకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ వి.శ్యాంసుందర్రావు, స్టేట్ సెక్రటరీ సత్యశ్రీ కాంత్, బీవీఆర్ చంద్రమౌళి, ఎల్.నాగేశ్వరరావు, జోగినాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితుల సదస్సు జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా భూకబ్జాలు జరిగాయని, రెవెన్యూ అధికారుల చేతివాటం కారణంగా పలువురు భూములను కోల్పోయి గగ్గోలు పెడుతున్నారని, రాజకీయ నాయకుల భూదాహానికి బలైన వారికి సీపీఐ అండగా నిలుస్తుందని జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. ఈమేరకు సోమవారం క్రాంతి భవన్‌లో పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిపి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ బాధితులకు వారి భూమిని వెంటనే స్వాధీనపర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. రాజకీయ నాయకుల భూదాహానికి ఎంతోమంది పేదలు బలయ్యారని, నకిలీ స్టాంపులతో దూర ప్రాంతాల్లో ఉన్నవారి భూములను రాజకీయ పలుకుబడి కలిగినవారు తమ పేర్లతో రాయించుకున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాధుడు కరువయ్యాడని, ఇప్పటివరకు భూ కబ్జాదారుల కోరల నుంచి భూమి స్వాధీనం చేసుకుని ఎంతమంది లబ్ధిదారులకు అందజేసిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న జరిగే సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, సీపీఐ నాయకులు నజీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక శారీరక వికాసం

యుటిఎఫ్ సభలో ప్రముఖ వైద్యులు గార రవిప్రసాద్

(సత్యంన్యూస్, రాజాం)

ఆటల ద్వారా మానసిక, శారీరక వికాసం పెంపొందుతాయని, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ప్రముఖ వైద్యులు గార రవిప్రసాద్ అన్నారు. ఏపీయూటిఎఫ్ ఏర్పడి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజాంలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఆవరణలో జరిగిన రాజాం నియోజకవర్గ స్థాయి క్రీడా వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాట్మెంటన్, చెస్ తదితర ఆటలతోపాటు ఏకపాత్రాభినయాలు, పాటలు, పద్యాలు, కవితలు తదితర సాంస్కృతిక పోటీలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించడాన్ని ఆయన కొనియాడారు. సోమవారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వై.కిశోర్, వి.సత్యంనాయుడు విన్నర్స్‌గా, కె.హరి, జి.సింహాచలం రన్నర్స్‌గా నిలిచారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎస్.కిశోర్ కుమార్, జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్, జేవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి పక్కి వాసు, బి.రామినాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ చుక్కా వైకుంఠరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మారెళ్ల కృష్ణమూర్తి, ఎ.వెంకట అప్పలనాయుడు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు గిరడ చంద్రశేఖర్‌నాయుడు, గేదెల రమేష్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మువ్వల రమేష్, బలివాడ నాగేశ్వరరావు, బాల కృష్ణ, ఎం.ప్రసాద్, జి.విష్ణుమూర్తి, వి.సత్యంనాయుడు, నిర్వహణ కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, వై.భాస్కర్, బి.శ్రీనివాసరావు, పి.మురళి. డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొత్త ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీఎస్సీ-2002 హిందీ పండిట్ల పెన్షన్ సాధన సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దూపాన తవిటిరెడ్డి, నవగాన రత్నకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనీఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రవేశానికి ప్రకటన జారీ చేసిందని, ఈ పథకం ద్వారా 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ తో పాటు గ్రాట్యుటీ, డీఆర్ కూడా ఇస్తామని ప్రకటించారని, ఉద్యోగులు మాత్రం పాత పెన్షన్ విధానంలో ఉన్న ప్రయోజనాలను మాత్రమే కోరుకుంటున్నారని వారు పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఉద్యోగుల చందాతో పనిలేని పాత పెన్షన్ పథకం కోసం ఆలోచన చేయాలని కోరారు.

ఎరువుల డీలర్లపై ఫెర్టిలైజర్ కంపెనీలు వివక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన ఎరువుల డీలర్లపై ఫెర్టిలైజర్ కంపెనీలు వివక్ష చూపుతున్నాయంటూ జిల్లా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్ల అసోషియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాడ సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా పలు అంశాలను తెలియజేశారు. జిల్లాకు వచ్చిన సబ్సిడీ ఎరువులో 50 శాతం (ఒక్కోసారి అంతకు మించి) ప్రభుత్వ ఆధీనంలోని మార్కెఫెడ్, ఆర్ఎస్కే, పీఏసీఎస్లకు పంపిణీ చేస్తున్న సమయంలో వారితో సమానంగా ప్రైవేట్ ఎరువుల డీలర్లకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యంలో కంపెనీలు వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. ఎరువులతో పాటు లింక్ పెడుతున్న ఇతర ఉపఉత్పత్తులు సైతం వారితో సమానంగా షేర్ చేయాలని డిమాండ్ చేశారు. బస్తాపై స్థానికంగా హమాలీ కోసం 15 నుంచి 20 రూపాయలు అదనంగా చెల్లిస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తే బస్తాకు రూ.30 నుంచి రూ.50 వరకు నష్టపోయే అవకాశం ఉందని, దీనిపై వ్యవసాయశాఖ మంత్రితో పాటు ప్రభుత్వానికి కూడా తమ సమస్యలను తెలిపామన్నారు. సమావేశంలో జిల్లా అసోసియేసన్ సెక్రటరీ వైశ్యరాజు గోవిందరాజు, సభ్యులు ధోని కొండలరావు, బోయిన గోపాల క్రిష్ణమూర్తి, పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

సెల్ఫ్ అసెస్మెంట్ టెస్ట్‌లు మూడు రోజులకు పరిమితంచేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర విద్యాశాఖ అధికారులు స్వీయ మదింపు పరీక్షలను ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఏడు రోజుల పాటు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం వల్ల పాఠశాల పనిదినాలు వృధా అవుతాయని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ క్రిష్ణారావు తెలిపారు. గత విద్యా సంవత్సరం వరకు గల ఫార్మేటివ్ మదింపు పరీక్ష విధానం మూడు పని దినాల్లో నిర్వహించేవారని, కానీ ఈ విద్యా సంవత్సరానికి ఫార్మేటివ్ ఎస్సెస్‌మెంట్ పేరు మార్చి సెల్ఫ్ అసెస్మెంట్ పేరుతో నిర్వహిస్తున్న ఈ పరీక్షలను రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంవరకు కేవలం ఒక గంట మాత్రమే నిర్వహించాలని రాష్ట్ర అధికారులు తెలపడంతో ఏడు రోజులు బోధనకు ఆటంకం కలుగుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ఉదయం, మధ్యాహ్నం నిర్వహించి మూడు పని దినాలలో సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు డిటిఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ పక్షాన వీరు విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో అమర జవాన్ స్థూపం నిర్మించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో అమర జవాన్ స్థూపం నిర్మించాలని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పెద్దరెల్లివీధిలోని కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో మాసిక సమావేశం జరిపారు. ఇటీవల వీర మరణం చెందిన జిల్లా సైనికులను స్మరించుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లా ఎంపీ, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎన్నికల ముందు మాజీ సైనికులకు ఇచ్చిన హామీలో భాగంగా పలాసలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు బలంగా అడుగులు పడుతున్నాయని, అలాగే మాజీ సైనికుల కోసం స్టేట్‌లో కార్పొరేషన్ ఏర్పాటుకు త్వరలో ప్రభుత్వ ప్రకటన కూడా వస్తుందని అన్నారు. ముఖ్యంగా జిల్లాలో అమర జవాన్ స్థూపం ఏర్పాటు చేయవలిసిన ఆవశ్యకత ఉందన్నారు. అమర జవాన్ స్థూపం జిల్లా నడిబొడ్డున ఏర్పాటు చేస్తే యువతకు దేశం పట్ల అంకిత భావం పెరుగుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని తన అభిప్రాయాన్ని తెలిపారు.

విజయవాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మాజీ సైనికుల కవాతులో మన జిల్లా నుంచి పాల్గొన్న హవాల్దార్ ఇ.రాజారావు (రిటైర్డ్)ను దుస్సాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎస్.ఎల్.రావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, ట్రెజరర్ ఎం.సింహాచలం, జి.అమ్మన్నమ్మ, విజయ లక్ష్మి, జమున, పుణ్యవతి, డి.వాసుదేవరావు, బి.రాంబాబు, ఎన్.లక్ష్మీ నారాయణ, ఎస్.అప్పలసూరి, ఎం.రాములు, కె.భీమారావు, ఎం.ఎన్. రావు, జి.రామారావు, దుర్గా రావు, జిల్లా నలుమూలల నుంచి మాజీ సైనికులు, వీర నారీమణులు పాల్గొన్నారు.

యథార్థ జీవిత సంఘర్షణలే 'కొండపొలం'

(సత్యంన్యూస్, రాజాం)

యథార్థ జీవిత సంఘర్షణలతో కూడి, మానవీయ, వ్యక్తిత్వ విలువలను ప్రతిఫలించే గొప్ప నవల కొండపొలం అని ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు పలికారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 115వ సమావేశం జరిగింది. సమావేశంలో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రచించిన కొండపొలం నవలను విశ్లేషిస్తూ శ్రీనివాసరావు ముఖ్య ప్రసంగం చేశారు. ఈ నవలలో రాయలసీమకు చెందిన గొర్రెల కాపరుల జీవన విశేషాలతో పాటు, కరువు రోజుల్లో వారు గొర్రెలను మేపడానికి కొండల మీదకు తోలుకుపోయి, అక్కడ పడిన బాధలు వివరించారని చెప్పారు. ఈ నవల ప్రధాన కథకు అనుసంధానిస్తూ కొన్ని పాత్రల ద్వారా మానవీయ విలువల్ని చెప్పించారని అన్నారు. అనంతరం వేదిక సభ్యులు శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. పొట్నూరు కోటిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, రౌతు గణపతిరావు నాయుడు, పెంకి దయానిధి నాయుడు, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, సమతం మహేశ్వరరావు, రాజాపు శాంతారావు, డాక్టర్ ఆల్తి మోహనరావు, పొదిలాపు శ్రీనివాసరావు, ఉరిటి గున్నేశ్వరరావు, శాసపు సత్యనారాయణ, కుదమ తిరుమలరావు, పడాల కవీశ్వరరావు, వల్లూరి రామినాయుడు, అంబల్ల రామ్మూర్తి, చేబోలు జయరాజు పాల్గొన్నారు.

సిండికేట్ మాయాజాలంలో చికెన్!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారులు ఎక్కువ మొత్తంలో చికెన్ కొనుగోలు చేసేవారికి పేపర్ రేట్‌పై రూ.60 వరకు తగ్గించి అమ్ముతుంటారు. అంటే మిగతా వినియోగదారులను ఆ మేరకు దోపిడీ చేస్తున్నట్లే కదా! ఈ సిండికేట్ మాఫియాను ఒక అడ్వకేట్ ఫారంగేట్ నడిపిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యాపారులు ఎంత చెబితే అంతకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

కార్పొరేట్ల కనుసన్నల్లో..

రాష్ట్రంలో చికెన్ మార్కెట్‌ను సుగుణ, స్నేహ, వెంకాబ్ లాంటి కార్పొరేట్ సంస్థలు శాసిస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో సంస్థ తన ప్రాబల్యాన్ని కొనసాగిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌కు ఊతమివ్వడం ద్వారా ఈ సంస్థలు రాష్ట్రంలో జిల్లాల వారీగా తమ నెట్‌వర్క్‌ను పెంచుకున్నాయి. దాంతో సొంతంగా ఫార్మింగ్ చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మార్కెట్ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని పౌల్ట్రీ రంగంలో సొంతంగా కోడిపిల్లలు కొని, పెంచి, చికెన్ అమ్మేవారి సంఖ్య 20 శాతం కంటే తక్కువగానే ఉంది. వీరంతా రిస్క్‌తో వ్యాపారం చేస్తారు. మిగిలిన 80 శాతం మంది ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ వైపు మొగ్గుచూపి ఏదో ఒక కార్పొరేట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ నిర్వహణ మొత్తం కార్పొరేట్ సంస్థల చేతిలోనే ఉంటుంది. స్థానిక యాజమాన్యాలు షెడ్లు, లేబర్ వ్యవహారాలు మాత్రమే చూసుకుంటాయి. కోడి పిల్లలు, మేత, మందులు, వ్యాక్సిన్ల సరఫరా అంతా కంపెనీలదే. కోడి పిల్లల్ని బాగా పెంచితే దానికి ఇన్సెంటివ్, గ్రోయింగ్ కాస్ట్ మాత్రమే పౌల్ట్రీ రైతులకు లభిస్తుంది. ఫార్మింగ్ పూర్తయిన తర్వాత కిలోకి రూ.2.50 చెల్లించి మొత్తం చికెన్ తరలించుకుపోతారు. అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో ఏడాదిలో నాలుగుసార్లు ఫార్మింగ్ చేస్తారు. లేదంటే ఒక్కసారితో దుకాణం సర్దేస్తారు. పౌల్ట్రీ యజమానులకు లాభనష్టాలతో సంబంధం ఉండదు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌లో సుగుణ చికెన్ ముందుండేది. ఆ తర్వాత స్నేహ సంస్థ ఆ స్థానాన్ని ఆక్రమించింది. ప్రస్తుతం వెంకాబ్ వచ్చి చేరింది. వీరితో పాటు స్థానికంగా ఫార్మింగ్ చేస్తున్నవారు ఉన్నారు.

ధరలో హెచ్చుతగ్గులు

ఈ సంస్థల మధ్య పోటీ నేపథ్యంలో మొదట్లో ఒక్కో సంస్థ ఒక్కో ధర అమలు చేసేవి. అనంతర స్థానిక యాజమాన్యాలతో కలిసి ఈ మూడు సంస్థలు ధరలు నిర్ణయించి పేపర్ రేట్‌గా ప్రకటించడం ప్రారంభించాయి. దానివల్ల విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం .. మూడు జిల్లాల్లో ధరలు దాదాపు ఒకే విధంగా ఉండేవి. ఆ తర్వాత స్థానిక వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి ధరలను నిర్ణయించడం ప్రారంభించారు. దీంతో అన్నిచోట్ల ఒకే ధర ఉండేది. తర్వాత కాలంలో కార్పొరేట్ సంస్థలు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌ను తగ్గించడం వల్ల స్థానిక పౌల్ట్రీ యజమానులు సిండికేట్ వైపు పెద్దగా మొగ్గు చూపలేదు. దీంతో చికెన్ వ్యాపారులు పేపర్ రేట్ కంటే రూ.30 తగ్గించి విక్రయించడం, కొందరు పేపర్ రేట్ కంటే రూ.10 అధికంగా విక్రయించడం ప్రారంభించారు. ఇలా చికెన్ ధరల్లో హెచ్చుతగ్గుల వెనుక మతలబు ఉందని వ్యాపారులు చెబుతున్నారు. స్నేహ చికెన్ నాణ్యమైనదనే అభిప్రాయం మార్కెట్‌లో ఉంది. దీంతో స్నేహ చికెన్‌ను పేపర్ రేట్ కంటే కేజీకి రూ.4 నుంచి రూ.7 అధికంగా చెల్లించి విశాఖ నుంచి దిగుమతి చేసుకోవడానికి వ్యాపారులు పోటీ పడుతుంటారు. అలా తెచ్చిన చికెన్‌ను పేపర్ రేట్ కంటే రూ.20 అధిక రేటుకు విక్రయిస్తుంటారు. అయితే సుగుణ చికెన్‌ను పేపర్ రేట్‌కే చెల్లించి దిగుమతి చేసుకుంటారు. దానికి అనుగుణంగా చికెన్ విక్రయిస్తుంటారు. లోకల్ మార్కెట్‌లో లభించే చికెన్‌ను పేపర్‌రేట్ కంటే రూ.15 నుంచి రూ.20 తక్కువకు సరఫరా చేస్తారు. దీంతో దీన్ని తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు బోర్డులు పెడుతుంటారు. సిండికేట్ చెప్పిన ధరకు విక్రయించని వారికి చికెన్ సరఫరా నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో వీరు లోకల్ చికెన్ కొనుగోలు చేసి తక్కువ ధరకే అమ్ముతున్నట్టు బోర్డులు పెడుతున్న పరిస్థితి అక్కడక్కడా ఉంది.

లోకల్ సరుకే బ్రాండెడ్ పేరుతో

సిండికేట్ ఆధ్వర్యంలో చికెన్ అమ్మకాలు జరిగినప్పుడు స్నేహ, వెంకాబ్, సుగుణ సంస్థలు సరఫరా చేసిన చికెన్‌తో పాటు లోకల్ వ్యాపారులు సరఫరా చేసిన చికెన్‌ను ఒకే రేటుకు వ్యాపారులు విక్రయిస్తుండేవారు. కొందరు లోకల్ సరుకునే కంపెనీ చికెన్‌గా చూపించి తక్కువ రేటుకు విక్రయిస్తున్నట్టు బోర్డులు పెట్టడం ప్రారంభించారు. దీనిపై మిగతా వ్యాపారులు అభ్యంతరం చెప్పడం ఇతరత్రా కారణాలు సెండికేట్ నిర్వాహకులకు తలనొప్పిగా మారాయి. మార్కెట్లో ఆధిపత్యం కాపాడుకోవడానికి కార్పొరేట్ సంస్థలు ఏడాదిలో మూడుసార్లు చిల్లర వ్యాపారులకు విందు సమావేశాలు నిర్వహించి బహుమతులు ఇస్తుండేవారు. అయితే కోవిడ్ తర్వాత పరిస్థితి అస్తవ్యస్తం కావడం, కంపెనీ చికెన్ కంటే లోకల్ సరుకు వైపే స్థానిక వ్యాపారులు మొగ్గుచూపడంతో పేపర్ రేట్ ఫిక్స్ చేసి ఆ ధరకే విక్రయించేలా సిండికేట్ నిర్ణయించింది. ప్రస్తుతం విజయనగరం సిండికేట్ గుప్పిట్లోంచి బయటకు వచ్చేసినా శ్రీకాకుళంలో మాత్రం సిండికేట్ నడుస్తోంది. వాస్తవానికి కేజీ లైవ్ బర్డ్ ఉత్పత్తికే రూ.90 ఖర్చవుతుంది. వేసవిలో కోళ్లు సరిగ్గా మేత తినవు. నీరు ఎక్కువగా తాగుతాయి. దీంతో వాటి పెరుగుదల రేటు తగ్గిపోతుంది. దీని ప్రభావం ఉత్పత్తి మీద పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు ఒక కోడి 40 రోజుల్లోనే 2.5 కేజీలు పెరుగుతుంది. అదే వేసవిలో మాత్రం 40 రోజుల్లో రెండు కేజీల బరువే పెరుగుతుంది. ఆ కారణంతోనే చికెన్ ధర పెంచి రూ.300 పైగా రేటుకు విక్రయిస్తుంటారు.

వర్సిటీ అక్రమాలపై సర్కారు స్టాండ్ ఏమిటి?

(మొదటిపేజీ తరువాయి)

దుర్వినియోగం కాదా అని ప్రశ్నించారు.

దళిత ఉద్యోగులకు అన్యాయం

వర్సిటీలో దళిత ఉద్యోగల పట్ల అంటరానితనం కొనసాగుతోందని ఆరోపించారు. డాక్టరేట్‌తో సహా అన్ని అర్హతలు ఉన్న దళిత మహిళను సబ్జెక్ట్ కాంట్రాక్టుగా నియమించి, ఆమె తర్వాత చేరివారికి రెగ్యులర్ పోస్టింగులు ఇవ్వడా, లైబ్రరీ అసిస్టెంట్‌కు ప్రమోషన్ ప్రొసీడింగ్ ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకోవడం, కీలక పదవుల్లో దళితులకు అవకాశం కల్పించకపోవడం వర్సిటీ పెద్దల వివక్షకు నిదర్శనమని విమర్శించారు. యూనివర్సిటీలో ఏకైక ఆదివాసీ ఉద్యోగిని పూర్తిగా పక్కనపెట్టడం వెనక ఉద్దేశమేమిటో వీసీ, రిజిస్ట్రార్ నోరు విప్పాలని జేసీ డిమాండ్ చేసింది. విశ్వవిద్యాలయంలోని మొత్తం ఉద్యోగుల్లో స్వీపర్లతో సహా మొత్తం 15 మందే ఎస్సీ, ఎస్టీలు ఉన్నారంటే ఇక్కడ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తుంగలో తొక్కి రాజకీయ సిఫార్సులతో, డబ్బు కట్టలతోనే నియామకాలు జరుపుతున్నారని ఆరోపించారు. వర్సిటీ పాలకమండలి అనుమతి లేకుండా 2019 నుంచి 2023 జనవరి వరకూ జరిగిన నియామకాలు, ప్రమోషన్స్‌పై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ దళిత సంఘాల జేఏసీ దశలవారీగా ఆందోళనలు చేస్తున్నా వర్సిటీ పాలకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రార్ తప్పుడు వైఖరి

విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఏకపక్షంగా తప్పుడు విధానాలు అనుసరిస్తున్నారని ఆరోపించారు. లైబ్రరీ అసిస్టెంట్‌కు ప్రమోషన్ ఇవ్వాలని స్వయంగా వీసీ ఆదేశించగా రిజిస్ట్రార్ మొదట ప్రొసీడింగ్స్ ఇచ్చి.. మళ్లీ వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు. జియో సైన్స్ విభాగంలో పనిచేసిన దళిత మహిళకు డాక్టరేట్‌తో సహా అన్ని

అర్హతలు ఉన్నందున ఆమెను ఇంజినీరింగ్ విభాగం ఫ్యాకల్టీగా నియమించాలని వీసీ ఇచ్చిన ఆదేశాలను సైతం రిజిస్ట్రార్ ఖాతరు చేయలేదని విమర్శించారు. వీసీ ఆదేశాలను నెల రోజులు పక్కన పెట్టి చివరికి ఆమెను సబ్జెక్టు కాంట్రాక్ట్‌గా నియమించడం కుల వివక్ష కాక ఇంకేమిటిని ప్రశ్నించారు. రిటైర్డు ఉద్యోగులను తీసుకోవద్దని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తుంటే.. వాటికి విరుద్ధంగా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులను ఎలా నియమించారో రిజిస్ట్రార్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఒక ఉద్యోగి ఒకే డిపార్టుమెంటులో కొనసాగడం మళ్లీ ఆమెకే ప్రిన్సిపల్ పదవి ఇవ్వడం, ఒకే ఉద్యోగికి రెండు మూడు పదవులు కట్టబెట్టడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని తెలియదా అని ప్రశ్నించారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో నిధుల దుర్వినియోగం జరిగిందని అడిట్‌లో తేలినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా మళ్లీ ఆమెకే కొత్త బాధ్యతలు అప్పగించడం వెనుక రిజిస్ట్రార్ కుల పక్షపాతం ఉందని ఆరోపించారు. ఎనిమిదేళ్లుగా ఒకే వ్యక్తి ఎగ్జామినేషన్ డీన్‌గా కొనసాగడం, అయనపై ఆన్సర్‌షీట్స్, ఓఎంఆర్ షీట్స్ కాంట్రాక్టులో లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడానికి కూడా ఇదే కారణమన్నారు.

నిమ్మ వెంకట్రావు హయాంలో షాడో వీసీగా పెత్తనం చేసిన ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ హనుమంతు సుబ్రహ్మణ్యం కంప్యూటర్ల కొనుగోళ్లలో భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై మూడుసార్లు విచారణ జరిగినా ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నకిలీ సర్టిఫికెట్లతో వచ్చిన వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో సహా నిమ్మ వెంకట్రావు హయాంలో అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా వాటిపై దర్యాప్తు ఎప్పుడు జరిపిస్తారో? ఎప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిమ్మ వెంకట్రావు హయాం నుంచి పూర్తిగా భ్రష్టు పట్టిన యూనివర్సిటీని పూర్తిగా ప్రక్షాళన చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి ఏమిటో చెప్పాలని జేఏసీ నేతలు కోరారు. ముఖ్యంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తక్షణమే చొరవ తీసుకుని విజ్ఞప్తి చేశారు. అడ్డగోలుగా నియమించిన 34 మందిని విధుల తొలగించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ మహిళ వికలాంగుల మైనారిటీలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెలా అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి బైరి ధనరాజ్, అంబేద్కర్ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టొంపల రమణ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, సల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా సంస్థాన్‌లో గోపూజ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని తమ్మినాయుడుపేట గ్రామంలోని అమ్మా సంస్థాన్ ఆలయ ప్రాంగణంలో సోమవారం గోపూజను నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణుని విగ్రహానికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ దంపతులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉట్టికొట్టే సంబరానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం గోశాలలో ఉన్న ఆవు, దూడలపై నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించారు. అటుకులు, పండ్లు, జావ తదితర పదార్థాలను గోవులకు పెట్టారు. సాయంత్రం 6.30 గంటలకు భజనా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సహాయ అర్చకులు నవీన్ శర్మ పాల్గొన్నారు.

జిల్లాను పర్యావరణరాహిత్యం నుంచి కాపాడుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాను పర్యావరణరాహిత్యం నుంచి కాపాడుకోవాలని, కాలుష్యంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతుండటంతో, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు వెళ్దామని మానవత ప్రతినిధులు పిలుపునిచ్చారు. మానవతా స్వచ్ఛంద సంస్థ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న నగరంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈమేరకు సోమవారం ఏపీ హెచ్‌బీ కాలనీ మానవతా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఈ పవిత్రమైన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో మానవతా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హయాతినగరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

కృష్ణాష్టమిని పురస్కరించుకొని హయాతినగరం శ్రీకృష్ణ మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు తోనంగి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ కృష్ణుని వంటి పరిపూర్ణుని ధ్యానం వల్ల మనకు కూడా పూర్ణత్వం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు ఐ.వర్మ, అప్పలరాజు, చిన్న, ఐ.జగ దీష్, రమేష్, ఎ.తాతారావు, దుక్కరాజు, ఎ.సూరిబాబు, ఆటో రమేష్‌లు పాల్గొన్నారు.

కృష్ణాపార్క్‌లో..

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నగరంలోని కృష్ణపార్క్ వద్ద ఉన్న కృష్ణుని విగ్రహానికి పట్టణం యాదవ పెద్దలు పూలమాలలు వేశారు. విగ్రహం మరింత అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించారు. కార్యక్రమంలో కిల్లాన శ్రీనివాస్, గడ్డిబోయిన కృష్ణయాదవ్, కళా వెంకటరావు యాదవ్, కలగ కేశవ యాదవ్, మట్టా రమణ యాదవ్, బోయిన హేమసుందర్ యాదవ్, పాలిన గోపియాదవ్, ఇద్దిబోయిన యుగంధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతన దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని స్థానిక పీఎన్ కాలనీలో గల వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్నికృష్ణుని వేషధారణ, రాధా వేషధారణతో చిన్నారులు అధిక సంఖ్యలో హాజరై నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఆలయ ధర్మకర్త, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన రావు మాట్లాడుతూ శ్రీకృష్ణుని గొప్పతనాన్ని, ఆయన ఉపదేశించిన భగవద్గీత గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పి.వైకుంఠరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అజ్ఞాన తిమిరాలను తొలగించే వారే గురువు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థుల్లోని అజ్ఞాన తిమిరాలను తొలగించేవాడే గురువని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పీఎన్ కాలనీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పరిచయ వర్గ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువు అంటే సాక్షాత్తు భగవంతుని స్వరూపమని, అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానం అనే వెలుగుని ప్రసాదించేవాడే గురువని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుడుమూరు శ్రీరామ్మూర్తి, కొండపల్లి రామారావు, అంధవరపు సంతోష్, అంధవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్యారాజకీయాలు ప్రజలు హర్షించరు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో హత్య రాజకీయాలకు తెర లేపిందని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి హత్య రాజకీయాలు ప్రజలు హర్షించరని, ఈ విషయం కూటమి నాయకులు గుర్తెరగాలని మాజీ డిప్యూటీ సీఎం, వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఫరీద్‌పేట గ్రామంలో ఇటీవల కూటమి కార్యకర్తల దాడిలో మరణించిన కూన ప్రసాద్ కుటుంబాన్ని స్థానిక మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌తో కలిసి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ స్పందిస్తూ ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి, హత్యోదంతం పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగినాయుడు, వాన గోపి, జడ్పిటిసి చింతు రామారావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కోరాడ చంద్రభూషణ గుప్తా, రాజాపు అప్పన్న, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రౌతు శంకర్రావు మాస్టర్, మండల పార్టీ అధ్యక్షులు కనుసు సీతారాం, జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పెరుమళ్ల తవిటినాయుడు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్, అటవీశాఖ మాజీ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షులు రెంటికోట త్రినాధరావు, తోట భార్గవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సతివాడ రామినాయుడు, కళ్లేపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించేది సనాతనధర్మం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హిందూ ధర్మాన్ని పరిరక్షించేది సనాతనధర్మం అని, దీనివల్ల సౌభ్రాతృత్వం, సహకారం, సమభావం వెల్లివిరుస్తాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం తోటపాలెం జంక్షన్ వద్ద ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ సనాతన ధర్మంలో అందరూ శాంత స్వభావికులే కావాలని, శాంతం సముద్రం కంటే గొప్పదని అన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు, టీడీపీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

27 నుంచి ఎస్టీ కమిషన్ సభ్యులు పర్యటన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 27, 28 తేదీలలో జిల్లాలో ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ పర్యటించనున్నారు. 27న జలుమూరు మండలం ఎస్టీ మాకివలస గ్రామం పర్యటించి, గిరిజనల నుంచి వినతి పత్రం స్వీకరిస్తారు. అదే రోజు హిరమండలం మండలం అంతకాపల్లి, పునుపేట, సవితిసిది, గిరిజన గ్రామాల్లో పర్యటిస్తారు. 28న ఆమదాలవలస మండలం అల్లిపిల్లిగూడ పర్యటించి అక్కడి నుంచి పాతపట్నం మండలం నల్లబొంతు గిరిజన గ్రామం పర్యటించి అక్కడి ఆదివాసీల నుంచి వినతులు స్వీకరిస్తారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.